సాక్షి
శ్రీకాకుళం
శుక్రవారం । 21 । మార్చి । 2025





పల్లెగూటికి పండగొచ్చింది

పొలవరంలో పాశిపోలమ్మ ఉత్సవం నిర్వహించనున్నారు. తొమ్మిదేళ్ల అనంతరం ఉత్సవం జరగనుంది.
- 8లో

న్యూస్‌రీల్

ఇసుక అక్రమ తరలింపుపై ఆగ్రహం



పోతయ్యవలస గ్రామస్తులు అడ్డుకున్న ఇసుక లారీ

నరసన్నపేట: గోపాలపెంట ఇసుక ర్యాంపు నుంచి రాత్రి సమయాల్లో ఇసుక తరలింపు జరుగుతోందని పోతయ్యవలస గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. బుధవారం రాత్రి ఇసుకతో వెళ్తున్న లారీలను గ్రామస్తులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా గ్రామస్తులకు, లారీ సిబ్బందికి వాగ్వాదం జరిగింది. అనంతరం పోలీసులు జోక్యం చేసుకొని గ్రామస్తులకు నచ్చజెప్పి లారీలను ముందుకు పంపించారు. ఈ సందర్భంగా గ్రామస్తులు మాట్లాడుతూ రాత్రి సమయాల్లో ఇసుక లారీలు అధికంగా వస్తున్నాయని, దీంతో ఇబ్బందిగా ఉంటోందని తెలిపారు. రాత్రి వేళల్లో ఇసుక తరలింపు నిలుపు చేయాలని కోరుతున్నారు. దీనిపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని తెలిపారు.


యాప్ అమలు తప్పనిసరి



మాట్లాడుతున్న బి.శాంతిశ్రీ

ఆమదాలవలస: అంగన్‌వాడీ వర్కర్లు తమకు ఇచ్చిన ఫోన్‌లో గల పోషణ ట్రాకర్ అనే యాప్‌లో ప్రతి ఒక్క లబ్ధిదారుని ఫేస్ క్యాప్చర్ చేయాలని జిల్లా ఉమెన్ అండ్ చైల్డ్ డెవలప్‌మెంట్, సాధికారత అధికారి బి. శాంతిశ్రీ సూచించారు. ఆమదాలవలస ఐసీడీఎస్ ప్రాజెక్టు కార్యాలయంలో సీడీపీఓ ఎస్.అనురాధ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోషణ భీ పడాయి భీ 3 రోజుల శిక్షణలో మొదటిరోజు గురువారం ఆమె పరిశీలించారు. కార్యకర్తలకు సదుపాయాలు ఉన్నాయా లేదా అన్న అంశాలు తొలుత అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆమె మాట్లాడుతూ అంగన్‌వాడీలకు వచ్చే చిన్నారులను సొంత బిడ్డల్లా చూసుకోవాలని కార్యకర్తలకు సూచించారు. శిక్షణలో అందించే అంశాలు క్షుణ్ణంగా నేర్చుకొని అంగన్‌వాడీ కేంద్రాల్లో వాటిని విధిగా నిర్వహించాలన్నారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తులకు 'కూటమి' చేసిన మేలేంటి?



శాసనమండలి మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న ఎమ్మెల్సీ నర్తు రామారావు

కవిటి: జిల్లాలోని కిడ్నీ వ్యాధిగ్రస్తులకు కూటమి ప్రభుత్వం చేసిన మేలు ఏమిటో చెప్పాలని ఎమ్మెల్సీ నర్తు రామారావు ప్రశ్నించారు. ఆయన గురువారం శాసనమండలి సమావేశాల సందర్భంగా మీడియాపాయింట్ వద్ద ఈ అంశంపై మాట్లాడారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో రూ.700 కోట్లు ఖర్చు పెట్టి హిరమండలం నుంచి ఉద్దానం ప్రాంతానికి తాగునీరు తీసుకువచ్చారని గుర్తు చేశారు. రూ.79 కోట్లు వెచ్చించి 200 పడకలతో పలాసలో కిడ్నీ రీసెర్చ్ కేంద్రాన్ని నిర్మించినట్లు తెలిపారు. కూటమి ప్రభుత్వం కిడ్నీ రోగులను ప్రస్తుతానికి గాలికి వదిలేసిందని దుయ్యబట్టారు. ఒక డెత్ జరిగితే గానీ మరో బాధితుడికి డయాలసిస్ కేంద్రాల్లో బెడ్ ఇచ్చే దుస్థితి దాపురించిందన్నారు. ఇచ్ఛాపురంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే డయాలసిస్ సెంటర్ ఏర్పాటుకు అవసరమైన మౌలిక సౌకర్యాలను కల్పించామని తెలిపారు. ఈ సెంటర్‌ను తక్షణం ప్రారంభించాలన్నారు. సోంపేట, కవిటి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రాల్లో ఉన్న సెంటర్‌లలో డయాలసిస్ బెడ్స్ యూనిట్లు పెంచాలని డిమాండ్ చేశారు. పలాస కిడ్నీ రీసెర్చ్ సెంటర్ ద్వారా కిడ్నీ వ్యాధి గ్రస్తులకు మరింత వైద్య సదుపాయాలు సమకూర్చాలని కోరారు. ఆనాడు పాదయాత్రలో ఇచ్చిన హామీ మేరకు వైఎస్ జగన్ అధికారంలోకి రాగానే రూ.10వేల పింఛన్ ఇచ్చారని, దానికి మరో రూ.5వేలు కలిపి కూటమి ప్రభుత్వం ఇవ్వాలని కోరారు.

కాలువ భూమి సమర్పయామి ▸ అన్నీ ఆక్రమణలే



అక్రమాల డొంక కదిలింది. 'సాక్షి' కథనంతో తీగ లాగిన అధికారులకు ఆక్రమణల పర్వం కళ్లకు కట్టింది. తమవి కాని భూములను దర్జాగా కబ్జా చేయడానికి చూసిన తీరు సుస్పష్టమైంది. ఖాళీగా ఉన్నాయని ప్రభుత్వ భూములతో పాటు సాగునీటి కాలువను.. ఆఖరికి దారిని కూడా వదలకుండా చదును చేసిన అధికార పక్ష నాయకుడి దుర్బుద్ధి బయటపడింది. విచారణలో దొరికిపోయినా మాయ మాటలు చెప్పి తప్పించుకోవాలని చూసిన నైజం బయటపడింది.

– సాక్షి ప్రతినిధి, శ్రీకాకుళం

- 'సాక్షి' కథనంతో రంగంలోకి రెవెన్యూ అధికారులు
- బయటపడిన టీడీపీ నాయకుడి నిర్వాకం
- 4.57 ఎకరాల ప్రభుత్వ భూములు దర్జాగా చదును
- 28 సెంట్ల దారి సైతం కబ్జా



అక్రమంగా చదును చేసిన ప్రభుత్వ భూములను పరిశీలిస్తున్న ఆర్ఐ

సాక్షి ఎఫెక్ట్

లావేరు మండలం బుడతవలస, తామాడ రెవెన్యూ పరిధిలో అన్నీ ఆక్రమణలేనని అధికారులు తేల్చి చెప్పారు. ఈ ప్రాంతాల్లో టీడీపీ నాయకులు చేసిన కబ్జాపై 'సాక్షి'లో ఈ నెల 20వ తేదీన 'కాలువ భూమి.. సమర్పయామి' శీర్షికతో ప్రచురితమైన కథనంపై రెవెన్యూ అధికారులు స్పందించారు. చదును చేసిన ఆక్రమిత భూములను రెవెన్యూ అధికారులు గురువారం పరిశీలించారు. కొలతలు వేసి ఆక్రమణలను గుర్తించారు.

ఆక్రమణలివే..

- లావేరు మండలం బుడతవలస, తామాడ రెవెన్యూ పరిధిలోని ప్రభుత్వ భూములను, రస్తాను, గెడ్డ పోరంబోకు ఆక్రమించినట్టు రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ నేతృత్వంలోని వీఆర్‌ఓలు, గ్రామ సర్వేయర్లు తేల్చారు.
- బుడతవలస రెవెన్యూ పరిధిలో సర్వే నంబర్లు గల 113/1, 113/2, 113/3, 113/4, 113/5లో గతంలో పలువురికి డీ పట్టాలు ఇచ్చారు. వీటిని సాగు చేయడం లేదు. సమగ్ర భూ సర్వే చేసినప్పుడు వీరంతా అందుబాటులో కూడా లేరు. దీంతో అవన్నీ ప్రభుత్వ భూములే (గయాలు) అని రికార్డుల్లో పేర్కొన్నారు.
- ఇప్పుడా 4.57 ఎకరాల భూములను టీడీపీ నాయకుడు ముళ్ల సాయి ఆక్రమంగా చదును చేసేసి అనుభవంలోకి తెచ్చుకున్నారు.
- అదే విధంగా ఈ భూములకు ఆనుకుని ఉన్న 28 సెంట్ల ప్రభుత్వ రస్తాను కూడా ఆక్రమించి చదును చేసేశారు.
- అదేవిధంగా తామాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 105–1లో సాగునీటి కాలువ ఉంది. దాన్ని కూడా కొందరు ఆక్రమించారు. దీంట్లో కొమ్మి నీలవేణి పేరుతో ఎకరా వరకు, కొమ్మి శాంతి పేరుతో 15సెంట్లు, పురుషోత్తపు ఆదినారాయణ అనే వ్యక్తి పేరుతో 10సెంట్లు ఆక్రమించారు. ఇవన్నీ 'సాక్షి'లో కథనం వచ్చాక పరిశీలించి, ఆక్రమణలని తేల్చారు.

చదును చేసిన ముళ్ల సాయి స్టేట్‌మెంట్ రికార్డు

ప్రభుత్వ భూములను అక్రమంగా చదును చేసిన దానిపై టీడీపీ నాయకుడు ముళ్ల సాయిని రెవెన్యూ అధికారులు విచారణ చేశారు. మీరెలా చదును చేస్తున్నారని, మీకు సంబంధమేంటి? అని, మీకెలా భూములొచ్చాయని ఆరాతీశారు. దానికి ఆయన తెలివిగా వ్యవహరించి, డీ పట్టా దారులు చదును చేయమని చెబితే చేశానని, దాని కోసం తమకు సొమ్ము ఇస్తున్నారని వివరణ ఇచ్చారు. పక్కనే ఉన్న రస్తాను ఎలా చదును చేశారని అడిగితే దానికి తనకు తోచిన సమాధానం ఇచ్చారు. ఇదంతా రికార్డు చేసి తహసీల్దార్‌కు అందించేందుకు నివేదిక సిద్ధం చేశారు.

అసైన్డ్‌దారులకు పిలుపు

సమగ్ర భూసర్వేలో ప్రభుత్వ గయాలు 4.57ఎకరాలు చూపిస్తుండగా, వాటిలో తమ పట్టా భూములు ఉన్నాయని కొందరు సమాచారం ఇవ్వడంతో వారంతా శుక్రవారం తహసీల్దార్ కార్యాలయానికి వచ్చి పట్టాలు చూపించాలని, సక్రమంగా ఉంటే అప్పగించడానికి, లేదంటే ప్రభుత్వ భూములుగానే పరిగణించడానికి, ఒకవేళ అమ్ముకుంటే పీఓటీ కింద స్వాధీనం చేసుకునే ఆలోచనలో అధికారులు ఉన్నారు. ఏదైనా శుక్రవారం జరిగే పట్టాల పరిశీలనలో తెలుతుంది. ఇదిలా ఉండగా, ఇదే భూమిలో కొంత రహదారి కూడా ఉంది. అది కూడా ఆక్రమణకు గురైంది. దీని బాగోతం కూడా బయటపడనుంది.

గెడ్డ పోరంబోకు ఆక్రమణదారులకు నోటీసులు

తామాడ రెవెన్యూ పరిధిలోని సర్వే నంబర్ 105–1లో సాగునీటి కాలువ(గెడ్డ పోరంబోకు) భూములను ఆక్రమించి, చదును చేసిన వారికి అధికారులు అక్కడి కక్కడే నోటీసులు జారీ చేశారు. ఎకరా మేర ఆక్రమించిన కొమ్మి నీలవేణి, 15సెంట్లు ఆక్రమించిన కొమ్మి శాంతి, 10 సెంట్లు ఆక్రమించిన పురుషోత్తపు ఆదినారాయణకు ఫారం 7నోటీసులు జారీ చేశారు. ఈ భూములను ఎందుకు స్వాధీనం చేసుకోకూడదో 14 రోజుల్లో వివరణ ఇవ్వాలని పేర్కొంటూ నోటీసులు ఇచ్చారు. వారిచ్చే వివరణ మేరకు తదుపరి చర్యలు తీసుకోనున్నారు. ఇదే విషయాన్ని రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ ధ్రువీకరించారు.



గెడ్డ పోరంబోకును ఆక్రమించిన వారికి జారీ చేసిన నోటీసు



చిత్రకారుడు రాహుల్ పట్నాయిక్

ఆర్ట్‌ఫుల్‌గా శుభాకాంక్షలు

ఇంటర్నేషనల్ స్పేస్ స్టేషన్ నుంచి సురక్షితంగా భూమిపైకి వచ్చిన భారత సంతతి వ్యోమగామి సునీతా విలియమ్స్‌పై సర్వత్రా ప్రశంసలు కురుస్తున్నాయి. అందులో భాగంగా శ్రీకాకుళానికి చెందిన రాహుల్ పట్నాయిక్ అనే చిత్రకారుడు ఆమె చిత్రాన్ని పావురం రెక్కపై చిత్రించారు. ఆయన ఇది వరకు పక్షుల రెక్కలపై శ్రీనివాస కల్యాణం, శ్రీరామ పట్టాభిషేకం, శ్రీకృష్ణ రాసలీలల ఘట్టాలతో పాటు సింహాద్రి అప్పన్న, ఈశ్వరుడు, వినాయకుడు తదితర చిత్రాలను గీశారు.

- శ్రీకాకుళం కల్చరల్

ఈకేవైసీ చేయించుకోవాలి

శ్రీకాకుళం పాతబస్టాండ్: జిల్లాలోని రేషన్ కార్డుదారులందరూ తప్పనిసరిగా ఈకేవైసీ చేయించుకోవాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో దాదాపు 1,99,123 మంది కుటుంబ సభ్యులు ఇంకా ఈకేవైసీ పూర్తి చేయాల్సి ఉందని పేర్కొన్నారు. వారంతా ఈ నెల 31వ తేదీలోగా ఈకేవైసీని పూర్తి చేయాలని సూచించారు. రేషన్ కార్డులో ఉన్న ప్రతి కుటుంబ సభ్యుడు (5 ఏళ్ల లోపు వయస్సు ఉన్న వారు మినహా) ఈకేవైసీ చేయించుకోవాలన్నారు.

7,378 కిలోల గంజాయి నిర్వీర్యం



నిర్వీర్యానికి సిద్ధంగా ఉంచిన గంజాయి



గంజాయి నిర్వీర్య ప్రక్రియను ప్రారంభిస్తున్న విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి

ఎచ్చెర్ల క్యాంపస్: శ్రీకాకుళం, విజయనగరం, పార్వతీపురం (మన్యం) జిల్లాల్లో 2024 నుంచి ఇప్పటి వరకు స్వాధీనం చేసుకున్న 7378 కిలోల గంజాయిని గురువారం పోలీసులు నిర్వీర్యం చేశారు. లావేరు మండలం పాతకుంకాంలో ఉన్న రెయిన్‌బో పరిశ్రమలో ఈ ప్రక్రియ చేపట్టారు. విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి, శ్రీకాకుళం, విజయనగరం, మన్యం జిల్లా ఎస్పీలు కేవీ మహేశ్వరరెడ్డి, వకుల్ జిందాల్, ఎస్వీ మాధవ్ రెడ్డి పర్యవేక్షించారు. మూడు జిల్లాల నుంచి గంజాయిని ఇక్కడకు వాహనాల్లో తీసుకువచ్చి తూకం వేసి.. శాస్త్రీయ పద్ధతిలో నిర్వీర్యం చేశారు. మొత్తం మూడు జిల్లాల్లో 226 కేసుల్లో ఈ గంజాయిని స్వాధీనం చేసుకున్నారు.

గంజాయి నియంత్రణపై ప్రత్యేక నిఘా: డీఐజీ గోపీనాథ్ జెట్టి

రాష్ట్రంలోని పోలీస్ ఉన్నతాధికారుల ఆదేశాలు మేరకు రాష్ట్రంలో గంజాయిపై ప్రత్యేక నిఘా పెట్టినట్లు విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జెట్టి చెప్పారు. పాతకుంకాంలో గంజాయి నిర్వీర్య కార్యక్రమంలో భాగంగా మీడియాతో ఆయన గురువారం మాట్లాడారు. 2025లో మూడు దశల్లో స్వాధీనం చేసుకున్న గంజాయిని నిర్వీర్యం చేశామన్నారు. మొదటి దశలో అనకాపల్లిలో జనవరిలో 3449 కిలోల గంజాయి, 39.04 లీటర్ల హాషిష్ ఆయిల్, రెండో దశలో అల్లూరి సీతారామరాజు జిల్లాలో 3075 కిలోల గంజాయి, 25.05 లీటర్ల హాషిష్ ఆయిల్, మూడో దశలో ప్రస్తుతం పాత కుంకాంలో 7378 కిలోల గంజాయిని నిర్వీర్యం చేశామన్నారు. గంజాయి నియంత్రణపై పూర్తిస్థాయిలో దృష్టిపెడుతున్నట్లు చెప్పారు. ఒడిశా రాష్ట్రం నుంచి గంజాయి అక్రమంగా సరఫరా అవుతోందని గుర్తించామన్నారు.

ఆపరేషన్ గంజా ఇలా..

- గంజాయి అక్రమ రవాణా అరికట్టేందుకు ఏర్పాటు చేసిన అంతర్రాష్ట్ర చెక్‌పోస్టులు: **24**
- జిల్లా సరిహద్దుల్లో ఏర్పాటు చేసిన చెక్‌పోస్టులు: **15**
- కేసులకు పక్కాగా చార్జిషీటు.. ట్రైల్‌లు వేగంగా జరిగేలా చర్యలు
- గంజాయికి బానిసలైన 86 మందికి డి– అడిక్షన్ కేంద్రాల్లో వైద్య సేవలు

ఎందుకు కాల్చలేదంటే..?

- సాధారణంగా గంజాయి నిర్వీర్యం అంటే చాలా చోట్ల కాల్చివేస్తారు.
- కానీ పాతకుంకాం రెయిన్‌బో ఇండస్ట్రీలో మాత్రం పోలీసులు శాస్త్రీయ పద్ధతిలో గంజాయిని నిర్వీర్యం చేశారు.
- ఈ పరిశ్రమలో ఈ ప్రక్రియ నిర్వహించడం ఇదే మొదటిసారి.
- ఇక్కడ బయో మెడికల్ వ్యర్థాలు నిర్వీర్యం చేస్తారు.
- గంజాయిని తగల బెట్టటం, గోతుల్లో వేసి పూడ్చటం వల్ల కాలుష్య సమస్యలు రావచ్చు.
- అందుకే ఈ పరిశ్రమను ఎంచుకున్నారు. ఇక్కడ పొగ కూడా బయటకు రాకుండా ఏకంగా 16 గంటల పాటు గంజాయిని నిర్వీర్యం చేసే ప్రక్రియ కొనసాగుతుంది.
- కాలుష్య రహిత నిర్వీర్య ప్రక్రియ వల్ల పర్యావరణానికి ఎలాంటి హాని కలుగదని పోలీసులు వివరించారు.

ప్రత్యామ్నాయాలపై దృష్టి సారించండి

- ట్రాఫిక్ పోలీసులకు ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాలు
- సాక్షి కథనానికి స్పందన

సాక్షి ఎఫెక్ట్



ఆటో యూనియన్‌తో మాట్లాడుతున్న ట్రాఫిక్ సీఐ నాగరాజు



సాక్షిలో ప్రచురితమైన కథనం

శ్రీకాకుళం క్రైమ్: 'డే అండ్ నైట్.. వెరీ టైట్..' శీర్షికన గురువారం 'సాక్షి'లో వచ్చిన కథనానికి ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి స్పందించారు. నగరంలో ట్రాఫిక్‌కు ఎలాంటి అంతరాయం కలగకుండా చూడాలని, ఇతర ప్రత్యామ్నాయ ఏర్పాట్లపై దృష్టి సారించాలని ట్రాఫిక్ సిబ్బందిని ఆదేశించారు. ఈ మేరకు ట్రాఫిక్ సీఐ నాగరాజు గురువారం సాయంత్రం ఆర్టీసీ కాంప్లెక్స్‌లో ఆటోయూనియన్లకు అవగాహన సదస్సు నిర్వహించారు. నగరంలో ఎక్కడి పడితే అక్కడ ఆటోలు పార్కింగ్ చేస్తూ ఉంచరాదని, ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని సీఐ సూచించగా దానికి ఆటో యూనియన్ వారు తమ యూనియన్ పరిధిలో ఎవరూ అలా పార్కింగ్ చేయరని, బయట ప్రాంతాల నుంచి వచ్చిన వాళ్లే అలా చేస్తుంటారన్నారు.

ఆర్టీసీకి లెటర్ పెట్టాం..

ఈ సందర్భంగా ట్రాఫిక్ సీఐ నాగరాజు 'సాక్షి'తో మాట్లాడుతూ డే అండ్ నైట్ బ్రిడ్జిపై ఆర్టీసీ బస్సులు నిలుపుదల చేస్తున్న విషయంపై ఇప్పటికే ఆర్టీసీ యాజమాన్యానికి లెటర్ పెట్టామని, జంక్షన్ సమీపంలో టీవీఎస్ షోరూం వద్ద ఆపమని చెప్పామన్నారు. ఆటోలు కూడా రన్నింగ్‌లో ఉంటే ట్రాఫిక్ ఏర్పడదని వారికి సూచనలు అందించామన్నారు. సెయింట్ జోసెఫ్ స్కూల్ మార్గంలోను, సింధూర జంక్షన్‌లో ఇప్పటికే బీట్ కానిస్టేబుళ్లు విధులు నిర్వర్తిస్తున్నారని వివరించారు.

వసపలో గజరాజుల బీభత్సం



కొత్తూరు: కొత్తూరు మండలం వసప పంట పొలాల్లో ఏనుగుల గుంపు గురువారం తిష్ట వేసింది. మొక్కజొన్న, అరటి, చెరుకు, కర్బూజా, సారి కందతో పాటు పలు రకాల కూరగాయ పంటలను ఏనుగులు ధ్వంసం చేస్తున్నాయి. దీంతో రైతులకు కోలుకోలేని నష్టం జరుగుతుంది. జీడితోటలు, మొక్కజొన్న తోటల్లో ఏనుగులు సంచరిండడంతో రైతులు పొలం పనులకు వెళ్లేందుకు భయపడుతున్నారు.



నిర్మానుష్యంగా సూర్యమహల్ కూడలి





సెయింట్ జోసెఫ్ స్కూల్ వద్ద ..

● ఎండ ప్రచండం

ఎండ ప్రచండమవుతోంది. మధ్యాహ్నం పూట నిప్పుల వాన కురుస్తోంది. బయటకు అడుగుపెట్టాలంటేనే భయపడేంతలా వేడి దాడి జరుగుతోంది. జిల్లా కేంద్రంలో గురువారం మధ్యాహ్నం రహదారులు ఇలా ఖాళీగా కనిపించాయి. రోడ్లపైకి వచ్చిన వారు వేడికి తట్టుకోలేక ఆపసోపాలు పడ్డారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, శ్రీకాకుళం

క్లుప్తంగా

నేత్రదానం స్ఫూర్తిదాయకం


పొట్నూరు ధర్మరాజు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని విశాఖ–ఏ కాలనీలో నివాసముంటున్న పొట్నూరు ధర్మరాజు(71) మృతి చెందడంతో ఆయన కుమారుడు పి.వెంకటరమణ, కుమార్తె ఎ.ప్రవీణ, అల్లుడు రమణమూర్తి నేత్ర దానానికి ముందుకొచ్చారు. రెడ్‌క్రాస్ ప్రతినిధి తవుడు ద్వారా విషయాన్ని రెడ్‌క్రాస్ చైర్మన్ పి.జగన్మోహనరావుకు తెలియజేయగా నేత్ర సేకరణ కేంద్రం టెక్నికల్ ఇన్‌చార్జి సుజాత, పి.సునీతలు హాజరై ధర్మరాజు కార్నియాలను సేకరించి విశాఖలోని ఎల్వీ ప్రసాద్ నేత్ర సేకరణ కేంద్రానికి తరలించారు.

కానిస్టేబుల్‌కు వేధింపులు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లా ఏసీబీలో అటాచ్డ్ కానిస్టేబుల్‌గా గత మూడున్నరేళ్లుగా విధులు నిర్వర్తిస్తున్న ఖైరి చంద్రశేఖర్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా, వైఎస్సార్ సీపీకి అనుకూలంగా సోషల్ మీడియాలో పోస్టులు పెట్టారంటూ గురువారం ఆరోపణలు వచ్చాయి. ఇదే విషయమై ఏసీబీ డీఎస్పీ బి.వి.రమణమూర్తి వద్ద 'సాక్షి' ప్రస్తావించగా ఆరోపణల్లో వాస్తవ, అవాస్తవాలు తేల్చాల్సింది ఆ కానిస్టేబుల్ మాతృవిభాగ యూనిట్ కృష్ణా జిల్లా ఎస్పీ అని, ఏసీబీకి సంబంధం లేదని, దీనిపై మూడు రోజుల క్రితమే కానిస్టేబుల్‌కు రిలీవ్ ఆర్డర్ ఇచ్చేశామన్నారు.

నేడు డీఎంఈ రాక

శ్రీకాకుళం: డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ (డీఎంఈ) డాక్టర్ రఘునందన్ శుక్రవారం జిల్లాకు రానున్నారు. ఉదయం 9.30 గంటలకు రిమ్స్ ఆస్పత్రి, వైద్య కళాశాలలను పరిశీలించి వైద్యులతో సమీక్షిస్తారు. మధ్యాహ్నం జిల్లాలోని మరికొన్ని ఏరియా ఆస్పత్రులను పరిశీలించే అవకాశం ఉంది.

పేకాట శిబిరంపై దాడి

కవిటి: మండలంలోని మాణిక్యపురం సమీప కొబ్బరితోట్లో నిర్వహిస్తున్న పేకాట శిబిరంపై పోలీసులు గురువారం దాడిచేసి నలుగురిపై కేసు నమోదు చేసినట్టు కవిటి ఎస్ఐ వి.రవి వర్మ తెలిపారు. వీరి వద్ద నుంచి రూ.8600 నగదు స్వాధీనం చేసుకున్నట్టు చెప్పారు.

టీజీఐ పరిశ్రమలో అగ్ని ప్రమాదం


పరిశ్రమను కమ్మేసిన పొగ

గార: మండలంలోని సతివాడ జంక్షన్‌లో ట్రాన్స్‌వర్డ్ గార్నెట్ ఆఫ్ ఇండియా(టీజీఐ) ఇసుక పరిశ్రమలో గురువారం మధ్యాహ్నం అగ్నిప్రమాదం సంభవించింది. యూనిట్ బ్లాక్ పక్క ఉన్న స్టాకు గదిలో ఒక్కసారిగా మంటలు చెలరేగాయి. సమాచారం అందుకున్న శ్రీకాకుళం అగ్నిమాపక సిబ్బంది పరిశ్రమ వద్దకు చేరుకుని మంటలను అదుపు చేసే ప్రయత్నం చేశారు. పెద్ద ఎత్తున అగ్నికీలలు చెలరేగడంతో సాయంత్రం వరకు సహాయక చర్యలు చేపట్టి మంటలను అదుపులోకి తీసుకొచ్చినట్లు అగ్నిమాపక శాఖాధికారి వరప్రసాద్ తెలిపారు. ఇసుక లోడింగ్ చేసే బ్యాగులు కాలిపోయినట్టు ప్రాథమికంగా గుర్తించామని చెప్పారు.

అదనపు వసూళ్లకు పాల్పడితే ఫిర్యాదు చేయండి

శ్రీకాకుళం పాతబస్టాండ్: గ్యాస్ సరఫరా సమయంలో సిబ్బంది అధిక మొత్తం వసూళ్లు చేస్తే పౌర సర ఫరా అధికారులకు ఫిర్యాదు చేయాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నిబంధనల ప్రకారం గ్యాస్ ఏజెన్సీ నుంచి వినియోగదారులు ఇంటికి 15 కిలోమీటర్ల పైన దూరం ఉంటే రవాణా చార్జి నిమిత్తం ఒక్కో సిలిండర్‌కు రూ.30 మాత్రమే వసూలు చేయాలని స్పష్టం చేశారు. 15 కిలోమీటర్ల లోపు ఉంటే ఎటువంటి అదనపు మొత్తం చెల్లించాల్సిన అవసరం లేదన్నారు.

విభిన్న ప్రతిభావంతుల గ్రీవెన్స్ నేడు

శ్రీకాకుళం పాతబస్టాండ్: విభిన్న ప్రతిభావంతుల గ్రీవెన్స్ స్వాభిమాన్ వినతుల స్వీకరణ కార్యక్రమం శుక్రవారం ఉదయం 10 గంటలకు జిల్లా పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్లు సహాయ సంచాలకులు కె.కవిత తెలిపారు. ఈ మేరకు గురువారం ఒక ప్రకటన విడుదల చేశారు.

యోగా అవార్డులకు దరఖాస్తులు ఆహ్వానం

శ్రీకాకుళం న్యూకాలనీ: కేంద్ర ప్రభుత్వం (ఆయుష్ శాఖ), ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం, యువజన సర్వీసుల శాఖ(విజయవాడ) ఆదేశాల మేరకు ప్రధానమంత్రి యోగా అవార్డు–2025కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్టు సెట్‌శ్రీ సీఈఓ బి.వి.ప్రసాదరావు ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో అర్హత కలిగిన వ్యక్తులు, సంస్థలు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. ఈ నెల 31తో దరఖాస్తు నమోదు గడువు ముగుస్తుందని తెలిపారు.

తెలుగు ఆప్షనల్ కాదు.. ఆత్మగౌరవం

- మాతృ భాషను మృతభాషగా మార్చొద్దు
- జూనియర్ కాలేజీల్లో తెలుగు సబ్జెక్టును తప్పనిసరి చేయాలి
- ఇంటర్ స్పాట్ కేంద్రం వద్ద అధ్యాపకుల నిరసన


శ్రీకాకుళం స్పాట్ కేంద్రం వద్ద నిరసన చేపడుతున్న జూనియర్ కళాశాలల తెలుగు అధ్యాపకులు

శ్రీకాకుళం న్యూకాలనీ:

దేశభాషలందు తెలుగు లెస్స అని ఓ మహానుభావుడు.. కీర్తించారని, కానీ తెలుగుభాష మాట్లాడే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో మాత్రం మాతృభాషను స్వయంగా ప్రభుత్వమే మృతభాషగా మార్చుతుండటం బాధాకరమని తెలుగు అధ్యాపకులు ఆవేదన వ్యక్తం చేశారు. ఇంటర్మీడియెట్ విద్యలో తెలుగు సబ్జెక్టునే లేకుండా నిర్వీర్యం చేసే దిశగా కూటమి ప్రభుత్వం అడుగులు వేస్తుండటాన్ని తెలుగు అధ్యాపకులు తప్పుబడుతున్నారు. సంస్కరణల పేరిట తెలుగు సబ్జెక్టును నిర్వీర్యం చేసే కుట్రలు జరుగుతున్నాయని జూనియర్ కళాశాలల తెలుగు అధ్యాపకుల సమాఖ్య ప్రతినిధులు డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు, హనుమంతు సుధాకర్, సనపల రమణ, పైడి శ్యామలరావు, పేడాడ ఉమామహేశ్వరరావు, డి.గిరిబాబు, బి.రామలక్ష్మి, తదితరులు ఆరోపించారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర సంఘం పిలుపు మేరకు ఇంటర్మీడియెట్ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రం వద్ద మధ్యాహ్న భోజన విరామ సమయంలో ప్రభుత్వం తీరును, ఇంటర్ విద్య ఉన్నతాధికారుల దుందుడుకు చర్యలకు ఎండగడుతూ నిరసన కార్యక్రమం చేపట్టారు. ఇంటర్ విద్యలో తప్పనిసరిగా ద్వితీయభాషగా ఉన్న తెలుగును.. సంస్కరణల పేరిట ఐచ్ఛిక (ఆప్షనల్)సబ్జెక్టుగా చేయడం ద్వారా భవిష్యత్తులో తెలుగుభాష మనుగడ ప్రశ్నార్థకంగా మారుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల నుంచి మాతృభాషను వేరుచేయడమంటే.. తల్లి నుంచి బిడ్డను వేరుచేయడమేనని మండిపడ్డారు.

ఆర్ఐఓకు వినతిపత్రం అందజేత..

అనంతరం స్పాట్ కేంద్రం నుంచి జిల్లా ఆర్ఐఓ కార్యాలయం వద్దకు ర్యాలీగా వెళ్లారు. ఆర్ఐఓ ప్రగడ దుర్గారావుకు వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వానికి, ఇంటర్ విద్య ఉన్నతాధికారులకు తమ గోడును తెలియజేయడమే కాకుండా తెలుగు భాష ఉనికిని, తెలుగు సబ్జెక్టు మనుగడను, తెలుగు అధ్యాపకుల ఆత్మగౌరవాన్ని కాపాడాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సమాఖ్య ప్రతినిధులతో పాటు అన్నెపు లక్ష్మణరావు, ఎస్.సంతోష్‌కుమార్, కె.లక్ష్మి, పైడి హేమలత, తారకేశ్వరరావు, వెంకటరమణ, కె.అసిరినాయుడు, ఎం.రమేష్, పైలా శశిధర్, శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.


ఆర్ఐఓ దుర్గారావుకు వినతిపత్రం అందజేస్తున్న తెలుగు అధ్యాపకుల సమాఖ్య ప్రతినిధులు

నాడు గొప్పన్నారు..?



ఇంటర్మీడియెట్ ఎడ్యుకేషన్ పాఠశాల విద్యలో భాగమేనని.. అలాంటి పాఠశాల విద్యలో గత ప్రభుత్వం ఇంగ్లీషు మీడియంను తీసుకొస్తే.. పూర్తిగా వ్యతిరేకించి తెలుగు మీడియం కోసం పట్టుబట్టిన కూటమి పార్టీలు ఇప్పుడు అధికారంలోకి వచ్చిన తర్వాత తెలుగు సబ్జెక్టే ఉండకూడదని భావించడం ఎంతమాత్రం తగదు.

– హనుమంతు సుధాకర్, తెలుగు అధ్యాపకుడు

పునఃపరిశీలన చేయాలి..



అటు కేంద్రంలోను, ఇటు రాష్ట్రంలో కూటమి పార్టీలో తెలుగుదేశం పార్టీనే అధికారంలోనే ఉంది. ఇప్పుడు తెలుగుభాషకు అన్యాయం చేసే కార్యక్రమానికి పూనుకోవడం తగదు. ఇప్పటికైనా పునఃపరిశీలన చేయాలి.

– బి.రామలక్ష్మి, తెలుగు అధ్యాపకురాలు

నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలి..



ఇంటర్మీడియెట్ విద్యలో సంస్కరణలు తీసుకురావడాన్ని వ్యతిరేకించడం లేదు. అయితే మాతృభాషైన తెలుగును తప్పనిసరి నుంచి ఐచ్ఛికం చేయొద్దనేదే మా ప్రధాన డిమాండ్. కార్పొరేట్ శక్తులకు తలొగ్గి తెలుగు సబ్జెక్టును నిర్వీర్యం చేసే కుట్రలో భాగం కావద్దని విజ్ఞప్తి చేస్తున్నాం.

– డాక్టర్ పేడాడ రాజేశ్వరరావు, తెలుగు అధ్యాపకుడు

తెలుగును బతికించాలి..



తెలుగు భాషను నిర్వీర్యం చేసే ఆలోచనలు సరికాదు. ఇంటర్మీడియెట్‌లో తెలుగు సబ్జెక్టును ఐచ్ఛికం చేస్తే తెలుగు భాష ఉనికే ప్రశ్నార్థకం అవుతుంది. తెలుగు సబ్జెక్టును ఐచ్ఛికం నుంచి తప్పించి తప్పనిసరి సబ్జెక్టుగా చేయాలి.

– పైడి శ్యామలరావు, తెలుగు అధ్యాపకుడు

కూటమి నేతలు కక్షగట్టారు

- అధికారులకు ఫిర్యాదు చేసిన అల్లాడపేట సర్పంచ్ చిన్నమ్మడు


డ్వామా అధికారులకు ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ చిన్నమ్మడు

జలుమూరు: కూటమి ప్రభుత్వం వచ్చాక గ్రామానికి చెందిన టీడీపీ నాయకులు అలజడులు, వివాదాలు సృష్టిస్తున్నారని జలుమూరు మండలం అల్లాడపేట సర్పంచ్ కల్యాణం చిన్నమ్మడు అధికారులకు రాతపూర్వకంగా ఫిర్యాదు చేశారు. అల్లాడపేట ఫీల్డ్ అసిస్టెంట్ పంగ వెంకటరమణపై గ్రామానికి చెందిన మెండ శిమ్మయ్య, ఎం.రాంబాబు, కల్యాణం జనార్దనరావు తదితరులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు విచారణ చేపట్టేందుకు గురువారం నరసన్నపేట క్లస్టర్ ఏపీడీ పూడి లోకేశ్ గ్రామానికి వచ్చారు. పంచాయతీ కార్యాలయంలో వేతనదారులతో మాట్లాడారు. గ్రామంలో లేనివారికి ఉపాధి హాజరు వేస్తున్నారని, తమకు పనులు కల్పించడం లేదని ఓ వర్గం చెప్పగా.. అందరికి పనులు కల్పిస్తున్నారని గ్రామానికి చెందిన మెండ అప్పారావు, నేతింటి చిన్నమ్మడు, మెండ ఆరుద్ర, మెండ రామచంద్రరావు, కల్యాణం సూర్యారావు తదితరులు వివరించారు. ఈ నేపథ్యంలో సర్పంచ్ చిన్నమ్మడు అధికారితో మాట్లాడుతూ తన భర్త కల్యాణం అచ్చెన్నను హత్య చేసిన వారే మళ్లీ ఇలాంటి తప్పుడు ఫిర్యాదులు చేస్తున్నారని చెప్పారు. వీరిపై పలు కేసులు కూడా నడుస్తున్నాయని తెలిపారు. వంట ఏజెన్సీ, అంగన్‌వాడీ, ఫీల్డ్ అసిస్టెంట్ ఇలా అందరినీ బెదిరిస్తున్నారని అధికారి దృష్టికి తీసుకొచ్చారు. నిత్యం గొడవలు సృష్టిస్తున్న వీరిపై ఇప్పటికే ఎస్పీకి ఫిర్యాదు చేశామన్నారు. గ్రామంలో వైఎస్సార్‌సీపీ సానుభూతిపరులపై కుట్ర పన్నుతున్నారని, అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఆమె కోరారు. కార్యక్రమంలో ఏపీఓ శేఖర్, వైఎస్సార్‌సీపీ నాయకులు కల్యాణం శ్రీనివాసరావు పాల్గొన్నారు.

నిమ్మాడలో పట్టపగలే చోరీ

టెక్కలి రూరల్: కోటబొమ్మాళి మండలం నిమ్మాడ ప్రధాన రహదారిలో మంత్రి సోదరుడి ఇంటికి కూతవేటు దూరంలో ఉన్న శిమ్మ కృష్ణారావు ఇంట్లో గురువారం పట్టపగలే చోరీ జరిగింది. కోటబొమ్మాళి పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణారావు తన భార్య లక్ష్మీతో కలిసి పొలం పనికి వెళ్తూ ఇంటి తాళం చెవిని ఆవరణలో పెట్టి వెళ్లిపోయారు. కుమారుడు, కోడలు పనుల నిమిత్తం నరసన్నపేట వెళ్లారు. తాళం చెవి ఇంటి ఆవరణలో పెట్టడం గమనించిన దుండగులు దర్జాగా తాళం తీసి ఇంట్లో ప్రవేశించి 6 తులాల బంగారం, కొంత నగదు అపహరించుకుపోయారు. కృష్ణారావు పొలం పనులు ముగించి ఇంటికి వచ్చే సరికి తలుపులు తెరిచి ఉండటంతో అనుమానంతో ఇంట్లోకి వెళ్లి చూడగా బంగారం, నగదు పోయినట్లు గుర్తించారు. అనంతరం కోటబొమ్మాళి పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

సీఎస్ఎస్ నూతన కార్యవర్గం ఎన్నిక


కార్యవర్గ ప్రతినిధులు

శ్రీకాకుళం కల్చరల్: క్రైస్తవ సమాజానికి సేవలు అందించడమే లక్ష్యంగా క్రిస్టియన్ సెక్యూలర్ సర్వీసెస్(సీఎస్ఎస్) ఏర్పాటు చేసినట్లు నిర్వాహకులు ప్రకటించారు. గురువారం జిల్లా కేంద్రంలోని మెర్సి చర్చిలో సీఎస్ఎస్ నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా బిషప్ డాక్టర్ బర్నబాస్ బింకం(శ్రీకాకుళం), ప్రధాన కార్యదర్శిగా ఓంపూరు రమేష్ (శ్రీకాకుళం), కోశాధికారిగా పాస్టర్ ఎం.షక్రబాబు (రావాడపేట), ఉపాధ్యక్షులుగా పాస్టర్ జి.ఇ.శామ్యూల్ అరుణ్‌కుమార్(ఆమదాలవలస), పాస్టర్ టి.పేతురు(ఎచ్చెర్ల), సహాయ కార్యదర్శిగా పాస్టర్ ఆర్.శామ్యూల్ (కొయ్యాం), సహాయ కార్యదర్శిగా పాస్టర్ టి.సూరిబాబు (రణస్థలం), గౌరవాధ్యక్షులుగా పాస్టర్ ఇ.శామ్యూల్ జాన్ (సరుబుజ్జిలి), గౌరవ సలహాదారులుగా పాస్టర్ ఎ.ఎ.పాల్ (సొట్టవానిపేట), కార్యవర్గ సభ్యులుగా పాస్టర్ సీహెచ్.మోజేష్ (గార), పాస్టర్ కె.వి.జాషువ (పాతపట్నం), పాస్టర్ బి.చిన్నారావు (సారవకోట), ప్రచార కార్యదర్శిగా పాస్టర్ అల్లు ఇమ్మానుయేలు (లావేరు), ప్రేయర్ కో–ఆర్డినేటర్‌గా పాస్టర్ ఆశిర్ కుమార్ (ఆమదాలవలస), యూత్ వింగ ప్రెసిడెంట్‌గా పాస్టర్ అహరోన్ నియమితులయ్యారు.

విద్యుత్ మీటర్ రీడర్ల ధర్నా


విద్యుత్ శాఖ కార్యాలయం వద్ద నిరసన చేపడుతున్న మీటర్ రీడర్లు

అరసవల్లి: విద్యుత్ మీటర్ల రీడింగ్ బాధ్యతలను నుంచి క్రమక్రమంగా తప్పించేలా యాజమాన్యం చేస్తున్న ప్రయత్నాలు దారుణమని, ఈ చర్యలతో వేలాది మంది మీటర్ రీడర్లు రోడ్డున పడనున్నారని బాధిత సంఘ నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. జిల్లా విద్యుత్ మీటర్ల రీడర్ల సంఘం ఆధ్వర్యంలో శ్రీకాకుళం సర్కిల్ కార్యాలయం వద్ద గురువారం నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆరేళ్లుగా నాట్ స్కాన్ మీటర్లు ఉన్నప్పటికీ, వాటిని మార్చకుండా వెరిఫై చేయకుండానే..మేమే స్కాన్ చేయడం లేదన్న సాకుతో భారీగా జీతాల్లో కోత విధించారని ఆవేదన వ్యక్తం చేశారు. సంస్థకు చెందిన మొబైల్స్ కూడా రీడర్లుకు ఇవ్వకుండా ప్రణాళికబద్ధంగా వేటు వేసేలా కుట్రలు చేస్తున్నారని ఆరోపించారు. ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనాలను ఇవ్వాలని తామంతా రాష్ట్ర వ్యాప్తంగా నిరసన చేస్తున్నామని.. తక్షణమే యాజమాన్యం న్యాయం చేయాలని విజ్ఞప్తి చేసారు. కార్యక్రమంలో సంఘ నేతలు ఎస్.అఖిల్, జి.తేజ, ఎల్.భాస్కర్, ఆర్.రమేష్, ఎన్.గోవిందరావు, పి.సంతోష్, బి.దేవీవరప్రసాద్ తదితరులున్నారు. అనంతరం విద్యుత్ శాఖ సర్కిల్ ఎస్ఈ నాగిరెడ్డి కృష్ణమూర్తి, ఆపరేషన్స్ ఈఈ పైడి యోగేశ్వరరావులకు వినతిపత్రాలు అందజేశారు.

దివ్యాంగులకు తప్పని పాట్లు


నిరాశలో దివ్యాంగులు

ఇచ్ఛాపురం టౌన్: వైకల్య ధ్రువపత్రాల పరిశీలన కోసం ఇచ్ఛాపురం సామాజిక ఆస్పత్రికి గురువారం వచ్చిన దివ్యాంగులకు అధికారుల తీరు కారణంగా ఇబ్బందులు తప్పలేదు. కంచిలి మండలం బెల్లుపడ గ్రామానికి చెందిన దివ్యాంగులు బి.సీతమ్మ, సీహెచ్ పాపారావు, కె.హరికృష్ణ, సీహెచ్ లత, నర్తు గీతలు అంగవైకల్య ధ్రువపత్రం కోసం దరకాస్తు చేసుకున్నారు. వైద్య పరిశీలనకు గురువారం ఇచ్ఛాపురం సీహెచ్‌సీకి హాజరుకావాలని నమోదుపత్రంలో సమయం కేటాయించారు. తీవ్ర వ్యయ ప్రయాసలకోర్చి దివ్యాంగులు రాగా.. పరిశీలకులు రాలేదని సిబ్బంది చెప్పడంతో నిరాశతో వెనుదిరిగారు. ఈ విషయం అధికారులు ముందుగా చెప్పకపోవడంతో సుమారు 40 కిలోమీటర్ల దూరం నుంచి ఆటోలో రావాల్సి వచ్చిందని వాపోయారు. కాగా, దివ్యాంగులకు బుధవారం మాత్రమే వైద్య పరిశీలన చేస్తారని వైద్యాధికారి దేవేంద్రరెడ్డి తెలిపారు. ఈ విషయాన్ని ముందుగానే ఆయా మండల అధికారులకు సమాచారం ఇచ్చామని చెప్పారు.

హాస్టళ్ల పర్యవేక్షణకు కమిటీ

శ్రీకాకుళం పాతబస్టాండ్: విద్యార్థుల సంక్షేమం దృష్ట్యా జిల్లాలోని సంక్షేమ శాఖ హాస్టళ్లలో పరిశుభ్రత, పారిశుద్ధ్యం, ఆహార నాణ్యతను పర్యవేక్షించడానికి తొమ్మిది మందితో జిల్లా స్థాయి కమిటీని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ గురువారం ఏర్పాటు చేశారు. ఈ కమిటీ పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని అన్ని సంక్షేమ శాఖ హాస్టళ్లను పర్యవేక్షిస్తుంది. దీనికి కలెక్టరే చైర్మన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో జిల్లా వెనుకబడిన తరగతుల సంక్షేమ శాఖ అధికారి, గిరిజన సంక్షేమ శాఖ అధికారి, జిల్లా మైనారిటీ సంక్షేమ శాఖ అధికారి, వికలాంగుల సంక్షేమం, సహాయ సంచాలకులు, ఆహార తనిఖీ అధికారి, జిల్లా పంచాయతీ అధికారి, మున్సిపల్ కమిషనర్లు(4), జిల్లా షెడ్యూల్డ్ కులాల సంక్షేమం సాధికారత అధికారి సభ్యులుగా వ్యవహరిస్తారు. సౌకర్యాల్లో లోపాలు ఉంటే చర్యలు తీసుకుంటారు.

ఉగాది కవితా పురస్కారాల విజేతలు వీరే

శ్రీకాకుళం కల్చరల్ : వేమన కవితా నిలయం (శ్రీకాకుళం), తపస్వి మనోహరం (హైదరాబాద్) సంయుక్త నిర్వహణలో విశ్వావసు నామ ఉగాది (2025) పురస్కార కవితా సంపుటాల విజేతలను నిర్వాహకులు మహ్మద్ రఫీ (ఈవేమన), నిమ్మగడ్డ కార్తీక్ గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఈ నెల 23న కేంద్ర గ్రంథాలయ సమావేశ మందిరంలో జరిగే కార్యక్రమంలో పురస్కారాలను ప్రదానం చేస్తామని పేర్కొన్నారు. ఉభయ తెలుగు రాష్ట్రాల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో పద్మావతి రాంభక్త (మెతుకు వెలుగులు), యాములపల్లి నరసిరెడ్డి (శిలావృక్షం), వైరాగ్యం ప్రభాకర్ (ఆకాశమంత), బగాది వెంకటరావు (బగాది బాసలు), వైతాళీయ కుచేలోపాఖ్యానం (మంత్రవాది వీరవెంకట సత్యనారాయణ), కడలి కవితా ప్రసూనాలు (కడలి ప్రకాశరావు) విజేతలుగా నిలిచారని ప్రకటించారు.

స్టేడియానికి వైఎస్సార్ పేరు తొలగింపు సరికాదు


ఎం.వి.స్వరూప్

శ్రీకాకుళం (పీఎన్ కాలనీ): విశాఖపట్నం మధురవాడలోని డాక్టర్ వైఎస్ఆర్ ఏసీఏ వీడీసీఏ క్రికెట్ స్టేడియం బోర్డులో వైఎస్సార్ పేరును తొలగించడం సరికాదని వైఎస్సార్‌సీపీ ఉత్తరాంధ్ర జిల్లాల యువజన విభాగం అధ్యక్షుడు ఎం.వి.స్వరూప్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగంలో ఒక పేజీని ఇలా పేర్లు మార్పుకే కేటాయించడం దారుణమన్నారు. మాజీ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి మానవతా దృక్పథంతో ఓ జిల్లా పేరును ఎన్టీఆర్ జిల్లాగా పేరు పెట్టారని గుర్తు చేశారు. ఇటువంటి నిస్వార్థ రాజకీయాలు చేసేది ఒక్క వైఎస్సార్ కుటుంబమేనని స్పష్టం చేశారు. కుట్లు, కుతంత్రాలు, మోసాలతో రాజకీయం చేసేది చంద్రబాబు, లోకేష్‌లని చెప్పారు. 2014 నుంచి 2019 వరకు టీడీపీ ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు స్టేడియం పేరు మార్చలేదని, ఇప్పుడే ఎందుకు మార్చారో ప్రజలకు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పటికైనా నా కక్షసాధింపు చర్యలు మానుకోవాలన్నారు.

గేట్ ర్యాంకులపై హర్షం


కేక్ కట్ చేసి ఆనందం పంచుకుంటున్న ట్రిపుల్ ఐటీ అధికారులు, విద్యార్థులు


శ్వేతశ్రీ


శ్రీనివాస్


అడ్డూరి నివాస్

ఎచ్చెర్ల క్యాంపస్: ఇంజినీరింగ్ పూర్తి చేసి జాతీయ విద్యా సంస్థల్లో పీజీ (ఎంటెక్) చదివేందుకు ఉద్దేశించిన అర్హత పరీక్ష 'గేట్'లో శ్రీకాకుళం రాజీవ్ గాంధీ వైజ్ఞానిక సాంకేతిక విశ్వవిద్యాలయం (ట్రిపుల్ ఐటీ) విద్యార్థులు ర్యాంకులు సాధించటం పట్ల క్యాంపస్ డైరెక్టర్ ప్రొఫెసర్ కొక్కిరాల వెంకటగోపాల ధన బాలాజీ హర్షం వ్యక్తం చేశారు. అధికారులు, సిబ్బంది, విద్యార్థులతో కలిసి గురువారం కేక్ కట్ చేసి ఆనందం పంచుకున్నారు. కొమరాల శేతశ్రీ ఈసీఈ విభాగంలో 241వ ర్యాంకు, అప్పాన శ్రీనివాస్ సీఎస్ఈలో 663వ ర్యాంకు సాధించారు. సీఎస్ఈ, ఈసీఈ, సివిల్, మెకానికల్, ట్రిపుల్ ఈలలో 60 మంది వరకు ర్యాంకులు సాధించారు. ఈ సందర్భంగా డైరెక్టర్ మాట్లాడుతూ జాతీయ విద్యా సంస్థల్లో పీజీ చేస్తే మంచి భవిష్యత్తు ఉంటుందని చెప్పారు. ట్రిపుల్ ఐటీ వంటి ప్రభుత్వ సంస్థ విద్యార్థులు అత్యున్నత ర్యాంకులు సాధించడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో పరిపాలన అధికారి ముని రామకృష్ణ, డీన్ ఆఫ్ అకడమిక్ కొర్ల మోహన్‌కృష్ణ చౌదరి, ఎఫ్‌వో వాసు, డీన్ ఆఫ్ వెల్ఫేర్ గేదెల రవి, సీఎస్ఈ హెచ్‌వోడీ రమేష్‌కుమార్, పీఆర్వో మామిడి షణ్ముఖరావు తదితరులు పాల్గొన్నారు.

అదరగొట్టిన నివాస్

శ్రీకాకుళం న్యూకాలనీ: గేట్ ఫలితాల్లో శ్రీకాకుళం నగరంలోని వాంబేకాలనీకి చెందిన అడ్డూరి నివాస్ ప్రతిభ కనబర్చాడు. ఆలిండియా స్థాయిలో 204వ ర్యాంకు సాధించి సత్తాచాటాడు. తండ్రి వెంకట్ మృతిచెందడటంతో తల్లి అనూరాధ టైలరింగ్ చేస్తూనే పిల్లలను చదివిపిస్తుంది. సోదరి ట్రిపుల్ ఐటీలో చదువుతోంది. నివాస్ ప్రతిభ కనబరచడంపై కుటుంబ సభ్యులు హర్షం వ్యక్తంచేశారు.

పల్లె గూటికి పండగొచ్చింది

- నేటి నుంచి పోలవరంలో పాశిపోలమ్మ సిరిమానోత్సవాలు
- తొమ్మిదేళ్ల తర్వాత ఉత్సవాల నిర్వహణ
- ఏర్పాట్లు పూర్తి చేసిన కమిటీ సభ్యులు

టెక్కలి:

ఆ పల్లెకు నవ వసంతం వచ్చింది. తొమ్మిదేళ్ల తర్వాత పండగొచ్చింది. టెక్కలి మండలం పోలవరంలో తొమ్మిదేళ్ల అనంతరం పాశిపోలమ్మ సిరిమానోత్సవాలు జరగనున్నాయి. శుక్రవారం నుంచి ప్రారంభం కానున్న ఈ ఉత్సవాలు ఈ నెల 25 వరకు అంగరంగ వైభవంగా కొనసాగనున్నాయి. 2016లో జరిగే ఈ వేడుకలకు ఉత్సవ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున ఏర్పాట్లు చేశారు. ఇప్పటికే సుదూర ప్రాంతాల నుంచి బంధువులు పోలవరం చేరుకోవడంతో గ్రామం కళకళలాడుతోంది. ఉత్సవాల్లో భాగంగా గ్రామ దేవతకు ప్రత్యేక పూజలతో పాటు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు.

సిరిమానోత్సవం ఇలా..

గ్రామానికి ఆనుకుని వంశధార ప్రధాన కాలువ గట్టుపై గల రావిచెట్టు వద్ద వెలసిన పాశిపోలమ్మ గ్రామదేవతకు సిరిమానోత్సవాలను తొమ్మిదేళ్లకోసారి నిర్వహించడం ఆనవాయితీగా వస్తోంది. గ్రామంలో నాయుడుగా పిలవబడే బగాది గంగాధర చౌదరి సిరిమానుపై ఆశీనులై అమ్మవారికి పూజలు చేస్తారు. ప్రతీ ఇంటి నుంచి కొత్త చీరను సిరిమానుకు (చింత కర్రకు) కడతారు. ఆ మానుపై గంగాధర చౌదరి ఆశీనులయ్యాక ఊరేగింపు నిర్వహిస్తారు. రావిచెట్టు వద్ద పూజలు చేసి ఉత్సవాలను ముగిస్తారు.


పాశిపోలమ్మ అమ్మవారు కొలువైన రావిచెట్టుకు వెళ్లే దారిలో ముఖద్వారం


అంగరంగ వైభవంగా ఏర్పాట్లు

ఉత్సవ కార్యక్రమాలివే..

- శుక్రవారం సాయంత్రం 5 గంటలకు అమ్మవారి గుడి నుంచి మేళ తాళాలతో దేవర తీసుకురావడంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయి.
- 22న ఉదయం 8 నుంచి పగటి వేషాలతో అమ్మవారి ఊరేగింపు ఉంటుంది. రణస్థలం, తాడేపల్లి గూడేం కళాకారులతో కోలాటం, తలకాయ డ్యాన్స్, చిన్నారులతో కోలాట ప్రదర్శనలు నిర్వహిస్తారు.
- 23న అమ్మవారి ఊరేగింపు, తాడేపల్లిగూడేం కళాకారులతో కాంతార, లేడీస్ స్పెషల్ గ్రూప్ డ్యాన్స్‌లు, మెగా ఈవెంట్స్ జరుగుతాయి.
- 24న ఉదయం అమ్మవారి ఊరేగింపు, బాడసూరన్న బృందం జాలారి నాటకం, మధ్యాహ్నం విశాఖపట్నం కళాకారులతో దాండియా నృత్యాలు, ఇచ్ఛాపురం కళాకారులతో కోయి డ్యాన్స్‌లు, రాత్రి 7 గంటలకు గుంటూరు, రాజమండ్రి కళాకారులతో సినీ సూపర్ డూప్స్ కార్యక్రమాలు, రాత్రి 10 గంటలకు రామాంజనేయ యుద్ధం, సత్యహరిశ్చంద్ర నాటకాలు నిర్వహించనున్నారు.
- 25న ఉదయం ఒడిశా కళాకారులతో ధూమ్ ధడాకా, సాయంత్రం బిందెల డ్యాన్స్‌లు, తీన్‌మార్, అమ్మవారి వేషాలు, సాయంత్రం మేళ తాళాలతో సిరిమానోత్సవం (అంజలి రథోత్సవం అనుపు పండగ) నిర్వహించనున్నారు.

అందరి సహకారంతో...



గ్రామస్తుల సహకారంతో పాశిపోలమ్మ సిరిమానోత్సవాలను నిర్వహించేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. తొమ్మిదేళ్ల తర్వాత జరిగే ఈ వేడులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా అందరి సహకారంతో ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తాం.

– గురుబెల్లి చిన్నంనాయుడు(బాలకృష్ణ), సర్పంచ్, పోలవరం, టెక్కలి మండలం